


# రావణాసురుడి బొమ్మ

## యర్రంశెట్టి శాయి

మరో అరగంటలో సామర్లకోట చేరుకొంటుంది రైలు. టైము చూసు కొంటూ కూర్చున్నాను. ఆ రాత్రంతా ఎలాగోలా గడిపేను కానీ, ఆ అరగంట గడపడం మాత్రం దుర్లభమయిపోతోంది. ఒక్కొక్క నిముషం ఒకో గంటలా గడుస్తోంది. అంతవరకూ వేగంగా వెళ్తోన్న ఆ రైలు అకస్మాత్తుగా తాబేటిలా నడుస్తున్నట్లనిపించసాగింది అసహనంగా వాచీవంక చూసుకొంటూ కూర్చున్నాడు. బయట ఇంకా చీకటిగానే ఉంది.

"భగవంతుడా! రాజిని కాపాడు." మనసులోనే దేవుడిని ప్రార్థించు కున్నాను. అలా అనుకొంటూంటే నా కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. జేబులోని టెలిగ్రామ్ తీసి మరోసారి చదివాను. "రాజికి సీరియస్‌గా ఉంది. వెంటనే బయల్దేరు" అంతకు ముందురోజు ఉదయం ఇచ్చిన టెలిగ్రామ్ అది. మరిప్పుడు పరిస్థితి మెరుగయిందో, మరింత క్షీణించిందో! రైలు నెమ్మదిగా ఆగిపోయింది. బయట స్టేషనేమీ


కనిపించటంలేదు. బహుశా సిగ్నల్ ఇవ్వలేదేమో? ఆ ఆలస్యం నన్ను మరింత కృంగదీస్తోంది. అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ బయల్దేరింది రైలు సామర్లకోట దగ్గరవుతున్నకొద్దీ రాజిని గురించిన ఆలోచనలు, పాతస్మృతులు క్రిక్కిరిసిపోతున్నాయ్ నాలో. రాజి మా మావయ్య కూతురు. నా కంటె నాలుగయిదేళ్ళు చిన్నదను కొంటాను.

ఆమె పుట్టిన సంవత్సరానికే అత్తయ్య చనిపోయింది. అప్పుడే రాజిని తనతోపాటు మా ఇంటికి తీసుకొచ్చేసింది మా అమ్మ. రాజిని చూస్తూనే నేనూ, అక్కయ్యా, చెల్లాయీ అందరం ఆశ్చర్యపోయాం. అప్పటికే రెండేళ్ళ పిల్లలా కనిపించేది. మా అందరికంటె బలంగా ఉండేది అప్పటికే నడిచేయడం చూసి మా వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. మూడేళ్ళకే దానికి మాటలన్నీ వచ్చేశాయ్. అయిదేళ్ళు వచ్చేసరికి రూపుకూడా మారిపోయింది. పెద్ద పెద్ద కళ్ళు, కోల మొహం, చిన్న నోరూ, కళ్ళు కనిపించకుండా మొహంమీదకు పడే జుట్టూ నాకు భయంగా ఉండేదెందుకో దాన్ని చూస్తూంటే. నాకంటె చిన్నదయినా మా ఇద్దరినీ చూస్తే ఆ విషయం ఎవరూ నమ్మేవారు కాదు. నేనే దానికంటే చిన్నవాడిననిపి అనుకొంటూండేవాళ్ళు.

అది మొదటి కారణం — రాజి అంటే నాకు అయిష్టం కలగడానికి. రెండోది దాని ప్రవర్తన. తను నిజంగానే నా కంటె పెద్దదానిలా ప్రవర్తించేది నన్ను ఏదోక సాకు తీసుకొని మందలిస్తూండేది. నేను మా ఇంటి చుట్టుపక్కల కుర్రాళ్ళందరితో రాజా - దొంగా ఆటలాడు కొంటూంటే తనూ వచ్చి జొరబడి ఆడేది సాధారణంగా నేనూ, శీనుగాడూ, చంద్రంగాడూ దొంగల వేషాలు వేసే వాళ్ళం. శంకరం, రాధాగాడూ, రాఘవ రావూ రాజులుగా ఉండేవాళ్ళు. మిట్ట మధ్యాహ్నం రెండింటికి అందరం పెద్దాళ్ళకు తెలీకుండా మా ఇంటి వెనుక ఉన్న సరుగుడు తోటలోకి రహస్యంగా ఓ సంకేత స్థలంలోకి చేరుకుని ఆడుకునే వాళ్ళం. తీరా ఆట ప్రారంభించబోయే సమయానికి ఎక్కడినుంచి వచ్చేదో తనూ వచ్చి నిలబడేది రాజి. దాన్ని చూడగానే మా కందరకూ పై ప్రాణాలు పైనే పోయేవి. "నేనూ ఆడతాను" అనేది మా అందరివేపూ నిర్లక్ష్యంగా, బెదిరింపుగా చూస్తూ. దాని పొగరు చూస్తూంటే నాకు కడుపు రగిలిపోయేది.

"వద్దు" అనడానికి మాకెవరికీ దమ్ము లేవు ఎందుకంటే మేమంతా అలా ఆ ఎండలో పడి సరుగుడుతోటల్లో ఆడుతున్నట్లు మా పెద్దాళ్ళతో చెప్పేస్తుంది. దాంతో మాకు దెబ్బలు తప్పవు. ఈ విషయం అందరకీ తెలుసు. పోనీ

ఆడనిద్దామా అంటే ఒక పార్టీలో ముగ్గురు, మరో పార్టీలో నలుగురయి పోతారు. అదీగాక సరుగుడు బెత్తాలతో మేము చేసే యుద్ధంలో ఆడపిల్ల పాల్గొనడం మా కిష్టంలేదు. ఏమీ చేయలేక దాన్ని రాజులపార్టీలో వేసే వాళ్ళం. ఆట ఆఖర్లో రాజులకూ దొంగలకూ మావూరి టూరింగ్ సినిమా హాల్లోని సినిమాలోలా జరిగే కత్తియుద్ధం మేమూ చేస్తూంటే రాజి తనో బెత్తం తీసుకొని మా వెనుకనుంచీ అందరినీ నిజంగానే చావబాదేసేది. అలా నిజంగా బాదకూడదని ఎన్నిసార్లు చెప్పినా నిష్ప్రయోజనమే అయేది. చాలాసార్లు మాఅందరి వొళ్లూ వాతలు తేలిపోయినయ్. తిరిగి దాన్ని కొట్టాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. రాకెట్లా దూసుకునిపారిపోయేది దాన్ని వెంబడించి అందుకోగల శక్తి మాలో ఎవరికీ లేదు. దాని బాధపడలేక కొద్దిరోజుల్లోనే మేమా ఆట కట్టివేశాం. గోళీలాటయితే అది మా జోలికి రాదనీ, ఒకవేళ వచ్చినా దానికా ఆట రాదుకాబట్టి రాజిని తేలిగ్గా ఓడించి మోచేత్తో దేకించవచ్చనీ, అలా చేస్తే రెండోసారి అది మా జోలికి రాదనీ నిర్ణయించుకొని మర్నాడు అందరం గోళీలు తెచ్చుకుని ఆట మొదలెట్టాం. మామూలుగానే సమయానికి వచ్చి నుంచుని నేనూ ఆడతానంది రాజి తన దగ్గరున్న గోళీ చూపిస్తూ. అసలు ఆ రోజు మేము గోళీలాట ఆడాలని నిర్ణయించుకున్నట్లు దానికెలా తెలిసిందో మాకెవ్వరికీ అర్థంకాలేదు. తర్వాత కూడా మాదే ఘోర పరాజయం. ఒక కన్ను మూసి ఖచ్చితంగా గురిచూసి మా గోళీలను ఆమడదూరం పోయేట్లు కొట్టటం మొదలుపెట్టింది. రాజికితప్ప మిగతా మా అందరి మోచేతులూ చర్మం లేచేట్లు గీరుకుపోయినయ్యా రోజు. మా అందరికీ మతిపోయినట్లయింది. "ఈ గొడవంతా ఎందుకు? అసలు మనం మధ్యాహ్నంపూట ఆటలాడవద్దు" అన్నాడు చంద్రంగాడు ఏమీ చేయలేక. అదే మంచిదని అందరం వారం రోజుల పాటు ఇళ్ళు కదలడం మానివేశాం. అవకాశం దొరికితే ప్రతీకారం తీర్చుకోవాలని ఎదురుచూడసాగాను నేను. అప్పుడే మా కోసమని కేరమ్‌బోర్డ్ కొనుక్కొచ్చారు నాన్నగారు. నేనూ, చెల్లీ ఓ వేపూ, అక్కా, రాజీ మరో వేపూ ఉండి ఆడాము. ఆడిన ఎనిమిది గేముల్లోనూ అయిదు గేములు గెల్చుకొంది. దానిచేతిలో ఏముందోగాని అది కొట్టిన ప్రతి కాయినూ బీరుపోకుండా 'పాకెట్' అయేది. ఆ రోజునుంచీ అదంటే ఓ విధమయిన ద్వేషం కూడా మొదలయింది నాలో. నేను ఓడిపోతున్నందుకుకాదది. గెలిచినప్పుడల్లా నావంక అదో రకంగా ఠీవిగా, గర్వంగా చూసేదది. మేమిద్దరం సింగిల్స్ ఆడినప్పుడు నా




పని మరీ ఘోరంగా ఉండేది. రెండు స్ట్రయికుల్లోనే బోర్డ్ క్లీర్ అయిపోయేది. అప్పుడు దాని చూపునుంచి తప్పించుకోడానికి నానా అవస్థాపడేవాడిని. తరువాత అసలు అది ఉన్నప్పుడు ఆడడం మానేసేవాడిని రానురాను దాని ఎదుట పడి తిరగడానికూ్కడా మనస్కరించేది కాదు నాకు. నేను ఫోర్త్‌ఫారం కొచ్చేసరికి రాజి ఫస్ట్‌ఫారంలో చేరిపోయింది. రాజీ బాధ నాకొక్కడికే కాదు. అమ్మా, అక్కయ్యా, చెల్లీ అందరూ విసుక్కుంటూనే ఉండేవారు. రాజి అల్లరిని తగ్గించడానికి అమ్మ ఎన్నో ప్రయత్నాలు చేస్తూండేది. ఎంత అల్లరి చేసినా, తల్లి లేనిదవడంవల్ల అదంటే వల్లమాలిన ప్రేమ అమ్మకి. ఒక్కనాడు కూడా కొట్టలేదు. రాజికి మాత్రం రోజుకో గొడవ చేయకపోతే నిద్రపట్టేదికాదు.

ఓ రోజు హాల్లోని అద్దం పగలకొట్టేసింది. అది చాలా ఖరీదయిన అద్దం. కావాలని లోతుగా ఉన్న నూతిలో బకెట్టు పడేసి చెప్పకుండా ఊరుకొనేది. మరోరోజు రెండు అందమయిన గాజుప్లేట్లు దాని చేతిలో ముక్కలయిపోయాయ్. వాటిని నాన్నగారు కలకత్తా నుంచి తెప్పించారు. మరోరోజు చక్కని అలారం టైపీస్ రాజి చేతిలోనుంచి జారి కిందపడి ముక్కలయిపోయింది అద్దం. ఆ తరువాత అది పనిచేయడం మానివేసింది. ఓసారి జరిగిన సంఘటన ఇంకా కళ్ళకు కట్టినట్లే గుర్తుంది ... ప్రక్కింటివాళ్ళ పెరట్లోని జామచెట్టు మీది జామకాయలు రాల్చడానికని రాళ్ళు రువ్వడం మొదలుపెట్టింది. అందులో ఓ రాయి వాళ్ళ గడపలో నుంచున్న పక్కింటి కుర్రాడికి తగిలి నెత్తికి పెద్ద

గాయమయిపోయింది. ఆ యింటివాళ్ళు కోపం పట్టలేక అమ్మని నానా మాటలూ అని వెళ్ళారు. అమ్మ రాజిని దగ్గరకు తీసుకొని "ఇంత రాలుగాయివేమే," అని కన్నీరు పెట్టుకొంది.

సెకండ్ ఫారం కొచ్చేసరికి రాజిమీద నాకు ద్వేషం మరింత ఎక్కువయి పోయింది. హైస్కూల్లో, నేనూ, మా స్నేహితుల్లూ ఏమేం చేస్తుందీ, ఎక్కడెక్కడ తిరుగుతుందీ అన్నీ సీక్రెట్ ఏజంట్లా కనిపెట్టి అమ్మకు చెప్పేస్తూండేది.అప్పట్లోనే రాజికీ నాకూ ఘోరమయిన యుద్ధం కూడా జరిగింది. ఆరోజు మానాన్నగారు మాంచి బొమ్మల కథల పుస్తకం తెచ్చిచ్చారు నా కోసం. తీసుకొని ఒక్కొక్క పేజీ చూస్తుంటే నా దగ్గరకొచ్చి "ఆ పుస్తకం ఇటివ్వు" అంది రాజి. నాకు కంపరం పుట్టు కొచ్చింది."ఇవ్వను"అన్నాను కోపంగా.

హఠాత్తుగా ముందుకి వంగి నా చేతి లోని పుస్తకం లాక్కొని పరుగెత్త సాగింది. గట్టిగా పట్టుకోవడంచేత ఆ పుస్తకం అట్టమాత్రం నా చేతిలో మిగిలి పోయింది. అలా చిరిగిపోయినందుకు నాకు చాలా సంతోషం కలిగింది. అది నాన్నగారికి చూపిస్తే రాజిని చావగొడతా రని నాకు తెలుసు.

"ఇప్పుడే నాన్నతో చెప్తానుండు" అన్నాను అట్టతీసుకెళ్ళి దానికి చూపుతూ.

"చెప్పుకో, ఫో" అంటూ తన చేతి లోని పుస్తకం తీసి ఈడ్చి నా మొహాన్న కొట్టింది. కళ్ళు బైర్లుకమ్మినయ్ కాసేపు నాకు. కోపంకొద్దీ దాన్ని బలంగా వీపు మీద బాదాను నేను. ఇద్దరం పిడిగుద్దులు గుద్దుకొన్నాము. పోట్లాట వచ్చినప్పుడల్లా అది ఓడిపోయే పరిస్థితిలో ఏంచేస్తుందో నాకు తెలుసు. ఇప్పుడూ అదే చేసింది. తనకున్న పొడుగాటి గోళ్ళతో నా ముఖ మంతా రక్కేసింది. అమ్మ వచ్చి కూక లేశాక అది అక్కడినుంచి వెళ్ళి పోయింది. ఆ రోజు రాత్రి భోజనంచేసిం తర్వాత నా గదిలో కెళ్ళేసరికి ఎదురుగ్గా గోడకి రాక్షసుడి బొమ్మ ఒకటి వేలాడ దీసి ఉంది. దాని కింద నా పేరు రాసి ఉంది. ఆ పని ఎవరిదో నాకు వెంటనే తెలిసిపోయింది. అది చాలా మంచి అవకాశంగా కూడా కనిపించింది. ఎప్పుడయినా దాన్ని పెద్దాళ్లతో తన్నించా లంటే ఆ బొమ్మ నాన్నగారికి చూపించ వచ్చు. దాన్ని జాగ్రత్తగా తీసి నా పెట్టె అడుగున దాచాను. కాని ఆ రోజు ఎప్పుడూ రాలేదు. ఆ తరువాత కొద్ది రోజులకే మా కుటుంబ పరిస్థితులు హఠాత్తుగా మారిపోయాయ్. ఒకరోజు రాత్రి రెండింటికి మెలకువ వచ్చింది నాకు. అప్పుడు పక్క గదిలోనుంచి అమ్మ ఏడుపు సన్నగా వినబడుతోంది. నేను లేచి నెమ్మదిగా తలుపుదగ్గరకు వెళ్ళి వినసాగాను.

"ఇప్పుడెలాగో మీరే చెప్పండి.

అందరూ చిన్నపిల్లలు. వీళ్ళను తిండి లేకుండా మాడ్చేద్దామా ?" అంటోంది అమ్మ.

"మరేంచేద్దాం చెప్పు ! ప్రొద్దుట్నుంచీ రాత్రివరకూ తిరుగుతూనే ఉన్నానుగదా! ఎక్కడా మరో ఉద్యోగం దొరికే సూచనలే కనిపించటంలేదు...."

"పోనీ- మీ స్నేహితుల నెవరినైనా అడగలేకపోయారూ ?"

"ఎవరున్నారనీ? మా కంపెనీ లాకౌట్‌వల్ల అందరి పరిస్థితీ మన పరిస్థితి గానే ఉంది. నేను ఏదొక సమయంలో ఎవరో ఒకరింట్లో భోజనం చేస్తూనే ఉన్నాను. నీదీ, పిల్లలదే నాకు దిగులు. పోనీ ఓ పనిచేయ్. రేపు నీ గాజులు తాకట్టు పెట్టేసి ఇంట్లోకి కావలసిన వస్తువులు తెచ్చుకో ! నేను తిరిగి వచ్చే సరికి రాత్రి తొమ్మిది దాటుతుంది."

"ఏమిటోనండీ! నాకు భయంగా ఉంది. ఒకపూటే తింటున్నా నగలన్నీ అయిపోతున్నయ్.... ఇంక ఈ గాజులు కూడా అయిపోతే మనకు మిగిలేదేమీ ఉండదు...."

"భగవంతుడిమీద భారం వేద్దాం! అంతకంటే చేయగలిగిందేముంది? కానీ ఈ విషయయాలేమీ పిల్లలకు తెలీనీకు! వాళ్ళు భయపడి చదువు నిర్లక్ష్యం చేస్తారేమో !"

"సరే !"

నేను అక్కడినుంచి వెళ్ళి నా పక్క మీదకు చేరుకున్నాను. నా కెందుకో భయంవేసింది. నాన్నగారి కంపెనీ తిరిగి తెరిస్తే బావుండుననుకొన్నాను. తెల్లారే సరికి రాజి బిగ్గరగా కేకలుపెడుతూ ఏడుస్తోంది. తనకి చీర కొనిపెట్టాలట. నాకు దానిమీద అంతులేని కోపం వచ్చింది. ఓ పక్క నాన్నగారు ఉద్యోగం లేక అవస్థపడుతోంటే మధ్యలో దీని చీర గొడవేమిటి? అమ్మ ఎంత నచ్చచెప్పినా వినటంలేదది. చీర కొనిపెట్టకపోతే స్కూలుకి వెళ్ళనని కూర్చుంది. విసుగు పుట్టి అమ్మ దాని వీపుమీద గట్టిగా ఓ దెబ్బ వేసింది. దాంతో ఇల్లెగిరిపోయేట్లు ఏడ్వ సాగింది. అక్కయ్య వచ్చి రాజిని బయటకు ఈడ్చుకుపోయింది. "చీర కట్టాలంటే నువ్వింకా బాగా పొడుగవ్వాలే! లేకపోతే చీర పెద్దదయి పోతుంది. నువ్వు స్కూల్ ఫైనల్ పాసయేసరికి ఒకటి కొనిస్తాములే. అమ్మ దగ్గర అలా గొడవచేయకేం," అంటూ నచ్చచెప్పిందామె. అప్పటిగ్గాని కొంత వరకూ శాంతించలేదు రాజి.

ఆ రోజునుంచీ అది అద్దంముందు నిలబడి గంటలతరబడి చూసుకొంటూ కూర్చునేది. ఆ విషయం అందరం దానికి తెలీకుండా చాటునుంచి చూసి నవ్వు కొంటూండేవాళ్ళం. పెద్దదయినకొద్దీ తగ్గి పోతుందనుకొన్న దాని అల్లరి మరింత ఎక్కువయిపోయింది. స్కూల్లో కూడా అందరితో పోట్లాటే! ఓ రోజు టిఫిన్

కారియర్ పారేసుకొచ్చింది. మరో రోజు టెక్స్ట్ పుస్తకాలు పోగొట్టుకుంది. ఇంకో రోజు చెప్పులు- ప్రతి రోజూ ఏదొక గొడవ. జరగాల్సిందే. ఆ పోయిన వస్తువులన్నీ కొనిపెట్టమని మరొక గొడవ. ఆ తరువాత రెండు నెలల్లో మా పరిస్థితి మరింత క్షీణించిపోయింది. పాలు కొనుక్కోడం మానేశాము. కాఫీ, టీలు లేవు. ఎలక్ట్రిసిటీవాళ్ళు బిల్లు కట్టనందుకు కనెక్షన్ తీసివేశారు. ఆ ఇంటి అద్దె కట్టలేకపోవడంవల్ల ఊరి బయట ఉన్న ఓ చిన్న పెంకుటింట్లోకి మారిపోయాము. ఇన్ని గొడవలవుతున్నా నాన్న కంపెనీ లాకౌట్‌లో ఉందన్న సంగతి నాకూ, అక్కయ్యకూ తప్పిస్తే మిగతావాళ్ళకు తెలీదు. ఏదో ఒకటి సర్ది చెబుతూండేదమ్మ. అందరికీ బట్టలు కూడా చిరిగిపోసాగినయ్. అమ్మకి అప్పుడే జబ్బుచేసింది. ఆమెను గవర్న మెంట్ హాస్పిటల్‌లోచేర్చారు నాన్నగారు. ఆమె అనేకసార్లు మా అందరికీ కడుపు నిండా భోజనం పెట్టి, ఆ తరువాత తనకేమీ మిగలకపోవడంచేత పస్తులుపడుకోవడం నాకు బాగా తెలుసు. అమ్మ హాస్పిటల్లో చేరడంతో నాన్నగారికి తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో మమ్మల్ని చూసుకోవడం - హాస్పిటల్లో అమ్మని చూడడం - తీరికలేకుండాపోయింది. ఓరోజు రాత్రి అన్నంలేదని రాజి పెద్ద ఏడుపు మొదలెట్టడంతో ఆయన తన రహస్యాన్ని బయటపెట్టక తప్పలేదు. మమ్మల్నందరినీ దగ్గర కూర్చోబెట్టుకొని తన ఉద్యోగం లేకపోవడం గురించీ, ప్రస్తుతం ఎదుర్కొంటున్న దారుణ మయిన దరిద్రం గురించీ - మేమందరం తనకి ఎలా సహకరించాల్సిందీ క్షుణ్ణంగా వివరించారు. అలా చెప్పేప్పుడు రెండు మూడుసార్లు ఆయన కళ్ళవెంబడి నీరు కమ్ముకోవడం మేము చూశాము. కొద్ది నిముషాలు మాట కూడా ఆగిపోయింది. ఆ రోజునుంచీ మా అందరిలోనూ మార్పు వచ్చింది. ఎంత ఆకలేస్తున్నా నోరుతెరచి ఎవ్వరినీ ఏమీ అడిగేవాళ్ళం కాదు. మా స్కూలు ఫీజులు కట్టక పోవడంచేత స్కూలుకెళ్ళడానికి వీల్లేక పోయింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవా లనుకొంది అక్కయ్య ఒక్కర్తే చుట్టు పక్కలున్న పిల్లలు చాలామందిని పోగు జేసి వారికి ట్యూషన్లు చెప్పటం ప్రారం భించింది. ఆ పిల్లల తల్లిదండ్రుల దగ్గర అప్పుడప్పుడు డబ్బు అడిగితీసుకొని అమ్మ కోసం మందులూ, పళ్ళూ కొంటూండేది. ఓరోజు అక్కయ్యతోపాటు మేమందరం కూడా హాస్పిటల్‌కు వెళ్ళాము. మమ్మల్ని చూసి కన్నీళ్ళు పెట్టుకొందమ్మ. అందరినీ దగ్గరకు తీసుకొని చాలాసేపు ఏడ్చింది.

"ఏం తింటున్నారో, ఏమో! అస్థి పంజరాల్లా తయారయారు," అంది. దిగు లుగా ఆమె ఏడుస్తూంటే మాకూ కూడా ఏడుపొచ్చింది. అలాంటి దుఃఖ

సమయంలో కూడా రాజి తన అల్లరి మానలేదు. తనూ అమ్మదగ్గరే ఉండి పోతానని మారాం మొదలుపెట్టింది. చివరకు దానిని హాస్పిటల్ పనివారి సాయంతో హాస్పిటల్‌నుంచి బయట కీడ్చుకురావాల్సివచ్చింది. ఇంటికొచ్చాక తనకు చీర కొనిపెట్టమని మళ్ళీ ఏడుపు. స్కూలుకెళ్తానని గొడవ — ఒకటేమిటి? అక్కయ్య దాన్ని ఎలా సహించిందో నా కిప్పటికీ అర్థంకాదు. ఆరోజు నాన్న గారు సంతోషంగా ఇంటికొచ్చారు. కంపెనీ లాకౌట్ ఎత్తివేశారుట. మర్నాటి నుంచే తను కంపెనీకెళ్ళాలట.

"ఇంక మనకు ఏ భయమూ లేదు. అందరూ స్కూలుకెళ్ళండి. మళ్ళీ మన పాత ఇంట్లోకెళ్ళిపోదాం! కడుపునిండా భోజనం చేద్దురుగాని...."

"మరి....నాకు చీర కొనిపెడతారా?" రాజి అడిగిందాయనను.

"ఓ – తప్పకుండా కొం టా ను" అన్నారు, నాన్నగారు దానిని దగ్గరకు తీసుకొని. ఆ విషయం, అమ్మకు చెప్పడానికని హాస్పిటల్ కెళ్ళిన నాన్న గారు అమ్మ శవంతో ఇంటి కొచ్చారు. ఆఖర్లో ఆమె "రాజికి చీర కొనివ్వండి," అందట రెండుసార్లు. నర్సులు చెప్పా రా విషయం నాన్నగారికి. వారంరోజుల వరకూ మాఇల్లే శ్మశానంలా అనిపించిం దందరికీ! ఆ తరువాత కూడా మాలో అదివరకటి సన్నిహితత్వం లోపించింది. అందరి మధ్యా అమ్మ వహించే పాత్ర అప్పుడే మాకు అర్థమయింది. జీవితం నెమ్మదిగా మళ్ళీ అదివరకటి గాడిలో పడుతోంది. రాజి అల్లరి మాత్రం ఏ మార్పూలేకుండా అలానే ఉంది. చీర కొనిమ్మన్న దాని గొడవ మాత్రం అంతం కాలేదు. అక్కయ్య వివాహం జరిగిపోయింది. బావతో ఢిల్లీ వెళ్ళడం కూడా జరిగిపోయింది. అక్కయ్య పాత్ర చెల్లి తీసుకొందిప్పుడు, అయితే అలా ఎంతోకాలం జరగలేదు. దాని కూడా వివాహం అయిపోయింది. మరికొద్ది రోజుల్లో అత్తగారింటికి వెళ్ళి పోతుంది. నేనూ పై చదువులకోసం వైజాగ్ వెళ్ళాల్సివచ్చింది. నాన్న గారికి ప్రమోషన్ రావడంవల్ల కాంప్‌లు ఎక్కువైపోయాయ్. నెలకు ఇరవై రోజులు ఊళ్ళు తిరుగుతూనే ఉండాలి. ఈ పరిస్థితుల్లో రాజిని మా మావయ్య దగ్గరకు పంపించేయడం తప్పదని నిర్ణ యించుకొన్నా మందరం. ఆమెను తీసుకెళ్ళడానికి మావయ్య కూడా వచ్చే శాడు. ఆ మర్నాడే ఆమె ప్రయాణం. నాన్నగారు ఆ రోజు సాయంత్రం రాజి కోసం ఓ చక్కటి చీర కొనుక్కొ చ్చారు. మర్నాడు ఉదయం తలంటుకొని ఆ చీర కట్టుకొమ్మని సలహా ఇచ్చింది చెల్లెలు. రాజి ఆనందం పట్టశక్యం కావడంలేదు. చుట్టుపక్కల వాళ్ళందరికీ తను చీర కట్టుకోబోతోందని చాటించే సింది.

మర్నాడు తెల్లవారకముందే లేచి కూర్చుంది రాజి. దాని హడావుడికి మా అందరికీ నిద్ర పాడయిపోయింది. ఇంకా పూర్తిగా తెల్లవారకముందే రాజి తలంటు స్నానం చేసి జుట్టు అరబెట్టుకొంటూ కనిపించింది మాకు. చెల్లాయ్ వంటింట్లో హడావుడిగా ఉంది. అందరం కాఫీ టిఫిన్లు ముగించేసరికి ఎనిమిదయిపోయింది. రాజి చీర కట్టుకొని పొంగిపోతూ అద్దం ముందు కూర్చుండిపోయింది. ఈలోగా మామయ్య రిక్షా తీసుకొచ్చేశాడు. రాజి తనతోపాటు తెచ్చుకొన్న సూట్ కేస్ తీసుకెళ్ళి రిక్షాలో పెట్టాన్నేను. నాన్నగారు రాజి వెళ్ళిపోతున్నందుకు లోలోపలే కుళ్ళిపోతున్నారు. మామయ్య రిక్షా దగ్గర కెళ్ళి నుంచున్నాడు.

"రాజిరాదేం-పిలువ్-ఎక్కడుందో!" అంది చెల్లాయ్.

"రాజీ" అంటూ నేను అక్కడినుంచే అరచాను. సమాధానం రాలేదు.

"దయ్యం-ఏ మూల ఏం చేస్తోందో-వెళ్ళి పిల్చుకురా!" అందామె. అన్ని గదులూ వెతుక్కొంటూ తిరిగాను. ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు. నాకు ఆశ్చర్యం కలిగింది. ఇంతలోనే ఎక్కడికి మాయమయిపోయిందా అని. చివరకు పెరట్లోని బాదంచెట్టు క్రింద కూర్చుని ఏవో ఆలోచనల్తో ఆకాశంలోకి చూస్తూ కనిపించింది.

"ఏయ్ పద! మావయ్య పిలుస్తున్నాడు," అన్నాను చిరాకుగా.

రాజి జవాబివ్వలేదు. నావంక చూడలేదు. అసలు నా మాట విన్నట్లే కనిపించలేదు. నిర్మలంగా, కదలకుండా అలాగే చూస్తోంది. అక్కడ ఏముందా అని ఆమె చూస్తున్నవేపే నేనూ చూసేను. ఆకాశం నిర్మలంగా ఉంది. చూడదగినంత విశేషం ఏమీ కనిపించలేదు. "ఏయ్ రాజీ! అవతల బస్‌కి లైమైపోతుంది. త్వరగా పద!" అన్నాను కొంచెం గట్టిగా.

అప్పటికీ రాజి చలించలేదు. నన్ను గమనించినట్లేలేదు. నాకు ఆశ్చర్యంతో పాటు భయంకూడా కలిగిందీసారి.

దీనికేమయిందివాళ .. ఎక్కడా ఓ క్షణం కూడా కూర్చోనిది - ఇరవై నాలుగ్గంటలూ ఏదో ఒక చిలిపి పనిచేసేది, ఇలా నిశ్శబ్దంగా కూర్చోడమే కాకుండా ఎంత పిలిచినా జవాబివ్వకుండా - అదీ తనెప్పటినుంచో కావాలని ఏడ్చి, అల్లరి పెట్టి, సాధించిన చీర కట్టుకున్న రోజున ఇలా ఎందుకు ప్రవర్తిస్తోంది? నాకేమీ అర్థంకావటంలేదు.

"ఏయ్ - విన్నే పిలిచేది! అలా కూర్చున్నా వేమిటి? రిక్షా వచ్చిందవతల. అందరూ నీకోసం చూస్తున్నారు ... ఓ రాజీ!" అంటూ గట్టిగా అరిచాను. ఓ నిమిషం తర్వాత నా వంక చూడకుండానే "బావా!" అంది నెమ్మదిగా.




తృళ్ళిపడ్డాను నేను. అంతవరకూ ఏనాడూ నన్ను 'బావా' అని పిలచిన పాపాన పోలేదు. ఎప్పుడూ ఏదో నిక్ నేమ్‌తో గానీ లేదా 'ఒరేయ్' అనిగానీ, లేదా పోట్లాటలొచ్చినప్పుడు తన కిష్ట మయిన తిట్లద్వారా గానీ పిలిచేది. నెమ్మదిగా, తాపీగా మాట్లాడసాగిందది. దాని గొంతులో ఏదో కొత్తదనం కనిపిస్తోంది. దాని కళ్ళలో అంతకు ముందు కనిపించని వెలుగు -

"నాకే ఆశ్చర్యంగా ఉంది బావా! నాకు ఊహ తెలిసినదగ్గర్నుంచీ కూడా ఇంత అల్లరిదాన్నిగా, మొండిదాన్నిగా ఎందుకు తయారయ్యాను? అమ్మని ఎందుకంత ఏడిపించేదాన్ని? నిన్నూ, అక్కయ్యనూ ఎందుకంత అల్లరి

పట్టించేదాన్ని? నాన్నగారి మనసు ఎందుకు కష్టపెట్టేదాన్ని? నా చుట్టూ ఉన్నవాళ్ళందరూ అయిష్టపడేలా ఎందుకు ప్రవర్తించేదానిని? ఎవ్వరు చెప్పినా వినకుండా, తెలుసుకోకుండా, ఎదురు తిరిగి ఎందుకు విర్రవీగేదానిని? నాకే తెలీదు బావా అది. ఈ చీరకోసం ఎందుకంత గొడవ చేసేదాన్నో తెలుసా? ఎందుకో నేను అందరిలా పుట్టలేదని పించేది నాకు. నా రూపం ఎందుకో నాకు సంతృప్తి కలిగించలేదు. అందరిలా ఉండాలన్న కోరిక నన్నెప్పుడూ కాల్చేస్తూ ఉండేది. చీర కట్టుకొంటే నేనూ ఓ మామూలు అమ్మాయిలా, కనబడతానన్న ఆశ కలిగింది నాలో. అందుకే చీర కావాలని గొడవచేసేదాన్ని. చీర కట్టుకొంటే నా రూపం ఎలా వుంటుందా అని ఊహించుకొంటూ గంటలతరబడి అద్దంముందు నిలబడే దానిని. కాని అమ్మని బాధపెడుతున్నా నన్న విషయమే నేను గమనించలేదు. ఆఖరి క్షణాల్లో కూడా అమ్మ "నాకు చీర కొనిపెట్టమని" కలవరించిందంటే అమ్మకి నా మీద ఎంత ప్రేముందో తెలీటంలేదూ? కాని.... బావా! అంతా నా భ్రమ. చీర కట్టుకొన్నంత మాత్రాన కొత్తరూపం ఎక్కడినుంచి వస్తుంది మనిషికి?" మాట్లాడడం కొద్దిక్షణాలు ఆపింది రాజి.

నేను నిశ్చేష్ఠుడనయి నిలబడి పోయాను. రాజి, పెద్ద ఆరిందాలా అంత పెద్దమాటలు మాట్లాడుతుంటే వింతగా ఉంది నాకు.

"కాని బావా! నా పైరూపం, లోపలి రూపం ఒకటికాదు. లోపల నాకే మాత్రం కపటంలేదు. పెంకెతనం లేదు. ద్వేషం లేదు అయిష్టం లేదు. కోపం లేదు. నేను అందరినీ ప్రేమించాను బావా! నిన్నూ, అక్కయ్యలనూ, అమ్మనూ, నాన్నగారినీ – నీకు తెలుసు కదు బావా! ఓ సారి మనందరం బందర్లో దసరా పండగకి అర్ధరాత్రి కోనేటి సెంటర్ కెళ్ళాం; అక్కడ ఊరేగింపుతో రావణాసురుడి బొమ్మను తీసుకొచ్చారు. బొమ్మ లోపల ప్రేలుడు సామానుంచారు. పైన గుడ్డలతో కప్పారు. దానికి నిప్పం టిస్తే ఏమయింది? బొమ్మ ప్రేలిపోయి అసలు రూపమేలేకుండా చెల్లా చెదురయి పోయింది. అవునా బావా! నేనూ ఆ రావణాసురుడిబొమ్మనే. నేనుచేసేఅల్లరీ, అగడాలూ అన్నీ ప్రేలుడు పదార్థాలు బావా! అవి ప్రేలిపోతే లోపల మిగిలే దేమిటి? ఖాళీ! ఏమీ ఉండదు. మీ అందరకూ నేను చేసిన అల్లరికి నేనంటే కోపం ఉంటుంది. నాకు తెలుసు. అందుకే నేను వెళ్ళిపోతున్నా మీకు సంతోషంగానే ఉంటుంది. కానీ చిన్న ప్పటినుంచీ, నాకు ఊహ తెలిసిం దగ్గర్నుంచీ, నా సర్వస్వమూ మీరే




అనుకొన్న నాకు - ఇప్పుడు మా ఇంటికే వెళ్తోన్నా-ఏ పరాయివాళ్ళింటికో వెళ్తున్నట్లుంది. నేనింక అదివరకటి రాజిని కాదు బావా! మారిపోయాను. ఎంత మారిపోయానంటే అప్పటికీ ఇక ముందుటికీ అసలు పోలికే ఉండదన్న మాట " ఇలా చెప్తూంటే ఆమె కళ్ళ వెంబడి జలజల నీళ్ళు రాలిపోయినయ్. లేచి నుంచుని నా దగ్గరకొచ్చి నా కళ్ళల్లోకి చూసింది.

"బావా! నా మీద కోపం ఇంకా ఉందా?"

"ఊహు లే...దు " అన్నాను గాబరాగా.

"అలా అని మాటివ్వు!" అంది చేయి చాస్తూ.

"నిజంగా రాజీ! నువ్వంటే నా కిప్పుడు కోపం లేదు " అన్నాను ఆమె చేతిలో చేయివేస్తూ.

"రాజిని తీసుకురా అంటే నువ్వా వచ్చి ఇక్కడే నుంచున్నావా" అంటూ వచ్చింది చెల్లాయ్. రాజి వెంటనే చెల్లాయ్‌తో బయటకు నడిచింది. నే నొక్కడినే అక్కడ మిగిలిపోయాను. హఠాత్తుగా ఓ అనుమానం వచ్చి రాజి ఆకాశంలోకి చూసినవేపు చూశాను. అక్కడ ఏమీ లేదు. అంతా తెల్లగా ఉంది.

రాజి వెళ్ళిపోయింది. ఆ తరువాత కొద్ది రోజులకు చెల్లాయ్ కూడా అత్తారింటి కెళ్ళిపోయింది. నేను వైజాగ్ యూనివర్సిటీలో చేరిపోయాను. ఆరు నెలలు కాకుండానే ఇప్పుడీ టెలిగ్రామ్.

"రాజికి సీరియస్‌గా ఉంది. వెంటనే బయల్దేరు."

రైలు సామర్లకోటలో ఆగింది. త్వర త్వరగా దిగి స్టేషన్ బయటకు నడిచాను. ఓ టాక్సీ ఎక్కి- వేగంగా పోనిమ్మని చెప్పాను డ్రైవర్‌కి. గాలిలో తేలి పోతోన్నట్లు నడుపుతున్నాడతను. నలభై నిమిషాల్లో మామయ్యవాళ్ళ పల్లె చేరు కున్నాను. ఒకరిద్దరి సాయంతో శిథిలా వస్థలో ఉన్న మామయ్య పెంకుటిల్లు చేరుకొన్నాను. మట్టి అరుగులమీద దిగులుగా కూర్చుని ఉన్నాడు మామయ్య. నన్ను చూడగానే అతని ముఖం వికసించింది.

"నీకు టెలిగ్రామ్ అందిందో లేదోనని ఆలోచిస్తున్నాను పద-రాజిని చూద్దూ గాని," ఆనందంగా అన్నాడతను. ఇద్దరం వెల్తురు అంతగా చొరని లోపలిగదిలోకి నడిచాము. మంచంమీద చిక్కి- శల్య మయిపోయిన రాజి గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉంది.

"మీ అందరిమీదా బెంగెట్టుకొం దయ్యా-ముఖ్యంగా నీ మీద" నెమ్మదిగా అన్నాడు మామయ్య. నాకు దుఃఖం కమ్ముకొచ్చిందామెను చూస్తుంటే.

మంచంమీద కూర్చుని "రాజ" అంటూ ఆమె శిరస్సుని తాకాను. అతి కష్టంమీద కళ్ళు తెరిచిందామె. "నేనే రాజీ వచ్చేశాను - చూడు!" అన్నాను ఆప్యాయంగా. ఒక్క-క్షణం ఆమెకళ్ళల్లో వెలుగు కనిపించింది నాకు. ఆ రోజు బాదంచెట్టుక్రింద కొత్తచీర కట్టుకొన్న సమయంలో ఆమె కళ్ళల్లో కనిపించిన వెలుగే అది. నెమ్మదిగా తనచేతిని ఎత్తి నా చేతిని తాకింది. అంతే- మరుక్షణం ఆమెప్రాణాలు గాలిలో కలిసిపోయినయ్. మామయ్య ఆమె చేతిని పట్టుకొని చూసి బిగ్గరగా ఏడ్చేయడం మొదలుపెట్టాడు. నేను లేచి బయటి కొచ్చేశాను, నాకు తెలీకుండానే. నా ప్రమేయమేమీ లేకుండానే నా కళ్ళవెంబడి నీళ్ళు కారిపోతున్నయ్.

రావణాసురుడి బొమ్మ ప్రేలి పోయింది.

లోపల ఖాళీ - అసలా బొమ్మ ఉండే దన్న గుర్తు కూడా మిగలనంతటి శూన్యం! — ఆ రాజి నాకు మిగిల్చిం దల్లా పుట్టెడు దుఃఖం. ఆనాడు నా గదిలో తగిలించిన నా "రాక్షస చిత్రం" అంతే!

